# ఎలగందల్ టైమ్స్

సంపుటి: 02
సంచిక: 304

ప్రతి అక్షరం ప్రజల కోసం..

తెలుగు దినపత్రిక | కరీంనగర్ | బుధవారం 07, మే 2025




# సమ్మె వాయిదా

- ఆర్టీసీ జేఏసీతో ఫలించిన చర్చలు
- డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల స్పందన
- కేబినెట్ లో చర్చించి నిర్ణయమని వెల్లడి
- చక్రం తిప్పిన మంత్రి పొన్నం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతభత్యాల పెంపుపై రూపాయి కూడా పెంచేది లేదంటూ చేసిన ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది. ఒకవైపు బీఆర్ఎస్ .. మరోవైపు బీజేపీ నుంచి తీవ్ర ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె నోటీసు ఇచ్చిన ఆర్ టీసీ కార్మికులు కూడా ఇక వెనక్కి తగ్గరనే భావన సర్వత్రా వ్యక్తమైంది. అయితే సీనియర్ కాంగ్రెస్ నేత, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తనదైన శైలిలో చక్రం తిప్పారు. సీపీఐ సీనియర్ నేత, శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావుతో మాట్లాడి చర్చలకు ఆహ్వానించారు.

- కరీంనగర్, ఎలగందల్ టైమ్స్

3

## సంస్థాగతంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి

5

- యువతకు ప్రాధాన్యం
- పదవుల భర్తీలో సమతుల్యత

## కాంగ్రెస్ ఖేల్ ఖతం.. దుకాణ్ బంద్

- సీఎం వ్యాఖ్యలే నిదర్శనం
- ఇగ రైతుల హామీలన్నీ గాలికొదిలేసినట్లే
- వృద్ధులకు రూ.4 వేల ఫించన్ ఇగ ఇయ్యరు
- మోసాల కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

4

# పురుమల్లపై.. వేటు



- సస్పెన్షన్ విధించిన క్రమశిక్షణ సంఘం
- రెండో షోకాజ్ నోటీసుపైనే నిర్ణయం
- తాజా వివాదంతో పీసీసీ ఆగ్రహం
- పంతం నెగ్గించుకున్న మంత్రి పొన్నం

కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత ఆరోపణలు చేసిన నేపథ్యంలో సస్పెన్షన్ విధించింది. అయితే ఈ సస్పెన్షన్ ఇటీవల జరిగిన గొడవ కారణంగా కాకుండా గతేడాది డిసెంబర్ 18న డీసీసీ సమావేశంలో పురుమల్ల శ్రీనివాస్ పొన్నం ప్రభాకర్ సహా సీనియర్ నేతలపై ఆరోపణలు చేసినందుకు గాను పీసీసీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. జనవరి 6న జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని.. ఆ తర్వాత కూడా పురుమల్ల శ్రీనివాస్ తన ప్రవర్తన మార్చుకోలేకపోవడాన్ని పీసీసీ తీవ్రంగా పరిగణించింది. ఇటీవలే జరిగిన డీసీసీ సమావేశంలోనూ మరోమారు మంత్రి పొన్నంపై పరోక్ష విమర్శలు చేసిన నేపథ్యంలో పీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మాజీ మంత్రి చిన్నారెడ్డి మంగళవారం సాయంత్రం పురుమల్లను సస్పెండ్ చేస్తున్నట్టుగా ఉత్తర్వులు జారీ చేశారు. పురుమల్లకు అనుకూలంగా మరోవర్గం పావులు కదిపి చర్యలు తీసుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహాత్మకంగా వ్యవహరించడం వల్లే కంట్లో నలుసులా మారిన పురుమల్లపై సస్పెండ్ వేటు పడేలా చొరవ చూపారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

- కరీంనగర్, ఎలగందల్ టైమ్స్

2

# పురుమల్లపై వేటు

- సస్పెన్షన్ విధించిన క్రమశిక్షణ సంఘం
- రెండో షోకాజ్ నోటీసుపైనే నిర్ణయం
- తాజా వివాదంతో పీసీసీ ఆగ్రహం
- పంతం నెగ్గించుకున్న మంత్రి పొన్నం

(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)

**కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత ఆరోపణలు చేసిన నేపథ్యంలో సస్పెన్షన్ విధించింది. అయితే ఈ సస్పెన్షన్ ఇటీవల జరిగిన గొడవ కారణంగా కాకుండా గతేడాది డిసెంబర్ 18న డీసీసీ సమావేశంలో పురుమల్ల శ్రీనివాస్ పొన్నం ప్రభాకర్ సహా సీనియర్ నేతలపై ఆరోపణలు చేసినందుకు గాను పీసీసీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. జనవరి 6న జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని.. ఆ తర్వాత కూడా పురుమల్ల శ్రీనివాస్ తన ప్రవర్తన మార్చుకోలేకపోవడాన్ని పీసీసీ తీవ్రంగా పరిగణిం చింది. ఇటీవలే జరిగిన డీసీసీ సమావేశంలోనూ మరోమారు మంత్రి పొన్నంపై పరోక్ష విమర్శలు చేసిన నేపథ్యంలో పీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మాజీ మంత్రి చిన్నారెడ్డి మంగళవారం సాయంత్రం పురుమల్లను సస్పెండ్ చేస్తున్నట్టుగా ఉత్తర్వులు జారీ చేశారు. పురుమల్లకు అనుకూలంగా మరోవర్గం పావులు కదిపి చర్యలు తీసుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహాత్మకంగా వ్యవహరించడం వల్లే కంట్లో నలుసులా మారిన పురుమల్లపై సస్పెండ్ వేటు పడేలా చొరవ చూపారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.**

## అందరూ ఊహించినట్టే..

అందరూ ఊహించినట్టే ఏడాదిన్నర తిరిగే సరికి పురుమల్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. పార్టీలోకి రావడం ఒక విశేషమైతే.. ఆ వెనువెంటనే టికెట్టు దక్కించుకోవడం మరింత సంచలనం రేపారు. అయితే అసెంబ్లీ ఇన్‌చార్జిగా తనకు దక్కిన కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంలో శ్రీనివాస్ అనుసరించిన వైఖరి సరికొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన నాయకుడు కావడంతో అర్బన్ రాజకీయాలను అర్థం చేసుకొని తనకంటూ ఒక ప్రత్యేకతను కాపాడుకోలేక.. తనను నమ్మిన అనుచర గణానికి న్యాయంచేయలేక అర్ధాంతరంగా చేతులెత్తేశారు. ఆయనపై సస్పెన్షన్ వేటు పడటం ఖాయమని అందరూ భావిస్తున్నా పురుమల్ల శ్రీనివాస్ మాత్రం ఈ విషయంపై ఎటువంటి ఆందోళన చెందకపోవడం గమనార్హం.

## మంత్రినే టార్గెట్ చేసిన పురుమల్ల..

కాంగ్రెస్ పార్టీలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేరిన పురుమల్ల శ్రీనివాస్ మొదటి నుంచి దుందుడుకుగానే వ్యవహరిస్తారనే పేరున్నది. తన మనసుకు ఏది తోస్తే అది చేయడం.. మాట కూడా అదుపులో పెట్టుకోకుండా బయటకు వెళ్ళగక్కడం వల్ల శ్రీనివాస్‌కు సన్నిహితులు ఎందరు పెరిగారో శత్రువులు కూడా అలాగే తయారయ్యారు. తొలుత చల్మెడ లక్ష్మినర్సింహారావుకు సన్నిహిత అనుచరునిగా ఉంటూ వచ్చారు. చల్మెడ ఆసుపత్రి ఆస్తి పన్ను వ్యవహారంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో బొమ్మకల్ సర్పంచుగా పురుమల్ల వ్యవహరించిన దూకుడు ఇరువురి మధ్య దూరాన్ని పెంచింది. దీంతో 2013లో టీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచు, జడ్పీటీసీగా తాను, తన సతీమణిని గెలిపించుకొని రాజకీయంగా తన సత్తా నిలుపుకున్నారు. తీరా గంగుల కమలాకర్ మంత్రి అయిన తర్వాత ఆయనతో వివాదం తలెత్తింది. గంగులపైనే ఆరోపణలు చేసిన నేపథ్యంలో పురుమల్ల నెలలపాటు జైలుకు వెళ్ళాల్సి వచ్చింది. గంగులతో సయోధ్యకు ససేమిరా అనడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన సన్నిహితులు చెబుతారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచరునిగా.. సన్నిహితునిగా గుర్తింపు పొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా కూడా పార్టీ అధికారంలో ఉండటంతో నియోజకవర్గంలో హల్‌చల్ చేశారు.

## రివర్స్ అయిన తొలి ఫిర్యాదు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఏ మాత్రం ప్రతిఘటించలేకపోయిన పురుమల్ల శ్రీనివాస్ తన ఓటమికి కారణమయ్యారంటూ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి రోహిత్ రావుపై పీసీసీ క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో సంఘం ఇద్దరు నేతలకు నోటీసులు జారీ చేయగా.. ఇద్దరు నేతల వివరణ చూసి పీసీసీ సంఘమే షాక్‌కు గురైంది. దీంతో పీసీసీ క్రమశిక్షణ సంఘం తిరిగి పురుమల్లకు షోకాజ్ నోటీసు జారీ చేసి అసలు ఎన్నికల్లో పోషించిన పాత్ర గురించి ఆరా తీయడం కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీలో తొలి అడుగే పురుమల్లకు ఎదురుదెబ్బకు దారితీసింది. మంత్రి పొన్నం పక్షాన కరీంనగర్‌లో అంతా తానై చక్కదిద్దాలని ఉవ్విళ్ళూరిన పురుమల్ల శ్రీనివాస్‌కు అనతికాలంలోనే మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సయోధ్యకు గండి పడింది.

## పొన్నంకు దూరంగా..

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దూరంగా పురుమల్ల శ్రీనివాస్ స్వంత రాజకీయాలు మొదలుపెట్టారు. తాను ఫిర్యాదు చేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, రోహిత్ రావుతోపాటు డీసీసీ చీఫ్ కవ్వంపల్లి



సత్యనారాయణతో సంప్రదింపులు జరిపి ఏకతాటిపై వచ్చేలా పావులు కదిపారు. మంత్రి శ్రీధర్ బాబు వర్గంగా ప్రచారం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్ 18న డీసీసీ కార్యాలయంలో పురుమల్ల శ్రీనివాస్ ఉన్నట్టుండి తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసి మంత్రి పొన్నం సహా పలువురు సీనియర్ నేతలపై కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆడియో వీడియో క్లిప్పింగులు కూడా లభించడంతో పీసీసీకి ఫిర్యాదులు వెళ్ళాయి.

## పురుమల్లకు రెండో షోకాజ్ నోటీసు..

సీనియర్ నేతలు, మంత్రుల పట్ల అనుచిత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ పీసీసీ క్రమశిక్షణా సంఘం పురుమల్ల శ్రీనివాస్ ఈ ఏడాది జనవరి 6న షోకాజ్ నోటీసు జారీ చేసింది. వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు 11వ తేదీన పురుమల్ల శ్రీనివాస్ తన వివరణ ఇచ్చారు. అయితే ఆ వెంటనే ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలుకావడంతో ఈ వ్యవహారంపై ఎవరూ పెద్దగా దృష్టి సారించలేకపోయారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ కేంద్రంలోనే పార్టీ నాయకత్వం అసెంబ్లీ ఇన్చార్జిపై చర్యలు తీసుకుంటే ప్రచారంలో ఇబ్బందులు ఏర్పడుతాయనే భావనతోనే నాయకత్వం సైలెంట్‌గా ఉండిపోయిందని తెలుస్తోంది.

## మరోమారు పొన్నంపై విమర్శలు..

పార్టీ సంస్థాగత నియామకాలకు సంబంధించి జరగాల్సిన డీసీసీ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కావడానికి తన అంగీకారం తెలిపారు. అయితే నిర్ణీత తేదీకి ఒక రోజు ముందే సమావేశం నిర్వహించడంతో తన కార్యకలాపాల్లో బిజీగా ఉండటంతో పొన్నం సమావేశానికి రాలేకపోయారు. ఇదే సమయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా పురుమల్ల శ్రీనివాస్ తన ప్రసంగంలో దుర్మార్గుడు అంటూ పలుమార్లు పరోక్షంగా మంత్రి పొన్నంను ఉద్దేశించి కామెంట్స్ చేయడంతో పొన్నం అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించారు. గాంధీభవన్‌కు పెద్ద ఎత్తున తరలివెళ్ళి ఫిర్యాదులు కూడా చేశారు. ఇప్పటికే రెండుసార్లు షోకాజ్ నోటీసులు జారీ చేసిన తర్వాత పురుమల్ల ప్రవర్తనలో మార్పు లేదని గట్టిగా నిర్ధారణకు వచ్చిన క్రమశిక్షణ సంఘం ఈ విషయంలో మరో నోటీసుకు ఆస్కారం ఇవ్వకుండా గత నోటీసుపై ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని.. అటు తర్వాత నేతలతో ప్రవర్తన సరిగా లేనందునే సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్ పై వేటు పడటం ఖాయమనే ప్రచారం జోరుగా సాగింది. ఈసారి సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్, పీసీసీ పరిశీలకులు సమిండ్ల శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి కూడా ఉండటంతో వారందరి నివేదికల ఆధారంగా చర్యలు తప్పవని అంచనా వేశారు. అయితే పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కరీంనగర్ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించి సమావేశంలో అసలేం జరిగిందో పలు రూపాల్లో నివేదికలు తెప్పించుకున్నారు. పురుమల్లకు అనుకూలంగా కొందరు.. వ్యతిరేకంగా కొందరు పీసీసీ చీఫ్ ని కలిసేందుకు గాంధీ భవన్ బాటపట్టారు. అదే సమయంలో డీసీసీ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఇద్దరూ డీసీసీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రస్తావన చేయలేదంటూ పురుమల్లను కాపాడే దిశగా నివేదిక అందించారు. పార్టీ నేతల మధ్య భిన్నమైన నివేదికలు రావడంతో వ్యవహారం అందరిలోనూ ఉత్కంఠను పెంచింది.

### క్రమశిక్షణా కమిటీ ఆగ్రహం

తీరు మార్చుకోవాలని గతంలోనే హెచ్చరించినా కూడా అదే రకంగా వ్యవహరిస్తుండటం పట్ల క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్, మాజీ మంత్రి చిన్నారెడ్డి తీవ్రంగా పరిగణించారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పోటీ చేసిన ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుపై చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని వివరణ ఇవ్వాలంటూ క్రమశిక్షణ కమిటీ సూచించింది. డిసెంబర్ 18న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని డీసీసీ కార్యాలయ ఆవరణలో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడికి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే మీటింగ్ నిర్వహించారని.. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, డీసీసీ అధ్యక్షుడిపై ఘాటు వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. పైగా అదే రోజు ఏఐసీసీ ఆదేశాల మేరకు పీసీసీ అధ్యక్షుడు హైదరాబాద్ లో ర్యాలీ నిర్వహించారని గుర్తు చేశారు. అదే సమయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని క్రమశిక్షణా చర్య కమిటీ పదే పదే హెచ్చరిస్తున్నా వైఖరి మార్చుకోలేదని హెచ్చరించింది. ఇలాగే కొనసాగితే, పార్టీ సంస్థాగత ప్రయోజనాల దృష్ట్యా క్రమశిక్షణ చర్యల కమిటీ చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించింది. అయినా కూడా తీరు మారకపోవడంతో మంగళవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

# భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం

**ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** తీవ్రవాదుల దాడి జరిగిన తర్వాత ఇటు భారతదేశం అటు పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడ్డదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 24 న హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశంలో జూన్ 2014 నుండి మే 2024 వరకు జరిగిన ఉగ్రవాద సంఘటనల వివరాలు ఇవ్వడం జరిగిందన్నారు. 1643 ఉగ్రవాద సంఘటనలు సంభవించాయన్నారు. 1925 సొరబాటు ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. 726 ప్రయత్నాలు సఫలం అయినాయి, ఉగ్రవాద దాడుల్లో 576 మంది భద్రత దళ సిబ్బంది మరణించారు. ఇలాంటి చర్యలు పాకిస్తాన్ అనే దేశం 1947లో భారతదేశం నుంచి విడిపోయినప్పటి నుంచి ఇప్పటివరకు ఇలాంటి చర్యలకు పాల్పడుతూనే ఉందన్నారు. పాకిస్తాన్ ఒక ఉగ్రవాద ఎగుమతి దేశంగా మారిపోయింది అన్నారు. కొన్ని వందల ఉగ్రవాద శిక్షణ కేంద్రాలను నడిపిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో కొంపెల్లి రవీందర్, సిగిరి శ్రీధర్, బైరం రాజేందర్, గజ్జల రవీందర్ లు పాల్గొన్నారు.



# సమ్మె వాయిదా

- ఆర్టీసీ జేఏసీతో ఫలించిన చర్చలు
- డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల స్పందన
- కేబినెట్ లో చర్చించి నిర్ణయమని వెల్లడి
- చక్రం తిప్పిన మంత్రి పొన్నం



## కేబినెట్‌లో చర్చించి సానుకూల నిర్ణయం: మంత్రి పొన్నం ప్రభాకర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి త్వరలోనే ఆర్ టీసీ కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్ టీసీ కార్మికులతో కలిసి పని చేశామని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏనాడూ కార్మికులకు వ్యతిరేకంగా ఏ ఒక్క నిర్ణయం తీసుకోలేదని ప్రభాకర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని నిర్వీర్యం చేస్తే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస పార్టీ దేనని ఆయన స్పష్టం చేశారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల బాటలో పడుతోందని.. గత 10 సంవత్సరాలుగా ఆర్టీసీని నిర్వీర్యం చేశారని... కొత్తగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని...ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని.. సీసీఎఫ్, పీఎఫ్ పైసలు వాడుకున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుండి చెల్లించాల్సిన మొత్తం రూ.400 కోట్లు చెల్లించిందన్నారు. 2017 పే స్కేల్ 21% శాతం ఇచ్చిందని.. దీంతో సంవత్సరానికి 412 కోట్లు భారం పడుతుందని పొన్నం తెలిపారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో పీఎఫ్ సొమ్ము 1039 కోట్లు చెల్లించామన్నారు. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుండి క్రమం తప్పకుండా చెల్లించబడుతుందన్నారు. అలాగే కొత్త బస్సులు కొనుగోలు చేశామని..తార్నాక ఆసుపత్రి ను సూపర్ స్పెషాలిటీ గా మార్చామన్నారు.

(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతభత్యాల పెంపుపై రూపాయి కూడా పెంచేది లేదంటూ చేసిన ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది. ఒకవైపు బీఆర్ఎస్ .. మరోవైపు బీజేపీ నుంచి తీవ్ర ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె నోటీసు ఇచ్చిన ఆర్ టీసీ కార్మికులు కూడా ఇక వెనక్కి తగ్గరనే భావన సర్వత్రా వ్యక్తమైంది. అయితే సీనియర్ కాంగ్రెస్ నేత, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తనదైన శైలిలో చక్రం తిప్పారు. సీపీఐ సీనియర్ నేత, శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావుతో మాట్లాడి చర్చలకు ఆహ్వానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మెకు పోవడం కంటే సర్కారుకు కొంత సమయం ఇస్తేనే బాగుంటుందనే ఆలోచనకు వచ్చిన జేఏసీ తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచే ప్రయత్నం చేసింది. ఈ క్రమం లోనే చర్చలకు మంత్రి పొన్నం ఆహ్వానించడంతో కార్మిక సంఘాలు సానుకూలంగా స్పందించాయి. ఈ తరుణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదా వేయడానికి మార్గం సుగమమైంది. దీంతో అటు ప్రభుత్వం.. ఇటు కార్మిక సంఘాలు ఊపిరి పీల్చుకున్నాయి. బుధవారం నుంచి ప్రారంభం కావల్సిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జాయింట్ యాక్షన్ కమిటీ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని ప్రకటించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిగిన చర్చలు సఫలమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, డిమాండ్లు నెరవేరకపోతే భవిష్యత్తులో మళ్లీ సమ్మెకు దిగక తప్పదని జేఏసీ నేతలు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు.

**ఒకవైపు చర్చలు.. మరోవైపు సన్నాహాలు..**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆర్టీసీ కార్మికుల నుంచి సమ్మె నోటీసును అందుకున్నది. ఎన్నికలకు ముందు పలు వరాల జల్లు కురిపించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు సంబంధించినవేవీ పట్టించుకోవడం లేదనేది కార్మిక సంఘాల ప్రధాన ఆరోపణ. బీఆర్ఎస్ పాలకుల బాటలోనే కాంగ్రెస్ కూడా అనుసరిస్తోందంటూ ఆగ్రహంతో ఉన్న సంఘాలు జెఏసీగా ఏర్పడి సమ్మె నోటీసును అందించాయి. ఒక దశలో సమ్మెను ఎదుర్కొనేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమైంది. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చలు నిర్ణయాత్మకంగా ఉన్నాయి. ఈ చర్చలకు ముందు సమ్మెకు పూర్తిగా సిద్ధమైన జేఏసీ హైదరాబాద్‌లో కవాతు నిర్వహించి తమ ఐక్యతను చాటింది. అయితే ప్రభుత్వం చివరి నిమిషంలో చర్చలకు ఆహ్వానించడం, హామీలు ఇవ్వడం వల్ల సమ్మెను వాయిదా వేసింది. సమ్మె ఒత్తిడి మధ్య, ప్రభుత్వం ఆర్టీసీతో సహా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులుతో కమిటీ ఏర్పాటు చేసింది.

**పరిష్కారానికి హామీలు..**

ఆర్టీసీ యూనియన్లపై ఉన్న ఆంక్షలను తొలగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆర్టీసీలో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ భద్రతకు సంబంధించి సర్క్యులర్ జారీ చేస్తామని ప్రకటించారు. కేంద్రం నుంచి రాయితీపై విద్యుత్ బస్సులు ఇక నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి అందజేస్తుందని ప్రకటించారు. కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపడతామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే విషయంలో సానుకూలంగా స్పందించారు. ఈ హామీలపై నమ్మకంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేసింది. అయితే, ఈ హామీలు అమలులో స్పష్టత లేకపోతే మళ్లీ సమ్మెకు దిగుతామని చైర్మన్ వెంకన్న స్పష్టం చేశారు.

**సమ్మె నోటీసు నేపథ్యం**

తమ 21 డిమాండ్లకు సంబంధించి ప్రభుత్వం స్పందించని పక్షంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్, లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో సమ్మె నిర్ణయం తీసుకున్నారు. అయితే, ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని చర్చలకు ఆహ్వానించడం వల్ల సమ్మె తాత్కాలికంగా నిలిచిపోయింది.

**అధికారుల కమిటీ ఏర్పాటు**

ఆర్టీసీ సమ్మెతోపాటు తెలంగాణలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సీనియర్ ఐఏఎస్ అధికారులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణ భాస్కర్ ఉన్నారు. ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, వారి సమస్యలపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ చర్య ఆర్టీసీతో సహా ఇతర రంగాల ఉద్యోగుల సమస్యలను దీర్ఘకాలంలో పరిష్కరించే దిశగా ఒక అడుగుగా చూడవచ్చు.

**సామాన్యులకు ఊరట...**

సమ్మె వాయిదాతో లక్షలాది మంది ప్రయాణికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ బస్సులపై ఆధారపడే విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులకు ఈ నిర్ణయం తాత్కాలిక ఉపశమనం కలిగించింది. రైల్వే ప్రయాణం అతి తక్కువగా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా లాంటి ప్రాంతాలలో ఉదయం లేస్తే ఆర్టీసీ బస్సు శరణ్యం. లక్షలాది మందిని నిత్యం జారవేసే బస్సులు నిలిచిపోతే ప్రైవేటు వాహనాలు నిలువు దోపిడికి దిగడం తథ్యం. ఇంట్లో నుంచి అడుగు బయటపెడితే భగ్గుమంటునన ఎండలు మండుతున్న తరుణంలో బస్సులు నిలిచిపోతే తమ పరిస్థితి ఏమిటీ.. అని సామాన్యులు దీనంగా ఎదురుచూశారు. అయితే చివరకు కథ సుఖాంతమై తాత్కాలికంగా వాయిదాకు మొగ్గు చూపడంతో వేసవికాలానికి ఊరట లభించింది.

## బీజేపీకి అవకాశం ఇవ్వండి

**బిజెపి రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ**



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ దగ్గర డబ్బులు లేవు తనను కోసినా నయా పైసా లేదని మాట్లాడుతుంటే.. ఒక సీఎం మాట్లాడుతున్న సోషల్ మీడియాలో అందరూ నవ్వుకుంటున్నా రని బిజెపి రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ అన్నారు. ఎవరి దగ్గరికి వెళ్ళినా పుట్టడం లేదు కేంద్ర మంత్రుల దగ్గరికి వెళ్ళినా కూడా ఎవరు కూడా కలవడం లేదు నన్ను దొంగలాగా చూస్తున్నారని బ్యాంకర్ల చుట్టూ తిరుగుతూ ఉంటే నన్ను ఏదో రకంగా చేస్తున్నారని మాట్లాడటం.. తెలంగాణ ప్రజలకు సిగ్గుచేటు ఒక సీఎం పోతాలా ఉండి అలాంటి మాట్లాడటం నా హృదయం చలించిపోయిందన్నారు. ఇలాంటి సీఎం మన తెలంగాణ రాష్ట్రానికి ఉన్నాడు అంటే ఎంత దౌర్భాగ్యమైన పరిస్థితుల్లో మనం ఉన్నామని ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉంది తెలంగాణ ప్రజలు ఇప్పుడు ఉన్నటువంటి ఎమ్మెల్యేలు అందరూ కూడా సపోర్ట్ చేసి తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచుకొని తెలంగాణ అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు.




## సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఈ నెల 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో ఆశ వర్కర్స్ భాగస్వాములు అవుతామని ముకుంద లాల్ మిశ్రా భవన్ ఆఫీసులో చేశారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత హాజరై మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా స్థిర వేతనం లేకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శారద, నాయకులు రాజమణి రజిత జయలక్ష్మి రోజా లక్ష్మి ప్రియాంక సరిత లత, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ ఉన్న విద్యార్థినికి ప్రోత్సాహం

**చొప్పదండి, ఎలగందల్ టైమ్స్:** ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళుతున్న విద్యార్థినిని ప్రోత్సహించి మరోసారి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన గొప్ప మనసును చాటుకున్నారు. గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన గడ్డం శతాక్షి లండన్ వెళ్లడానికి అవసరమైన రూ.70 వేల విలువైన విమాన టికెట్‌ను అందజేశారు. ఖండాంతరాలు దాటి చదువుకొని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాగా భారతదేశానికి ఖ్యాతి తీసుకురావాలని సూచించారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించి అండగా నిలవడంలో ముందుంటారని మరోసారి నిరూపించుకున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన గడ్డం శతాక్షి కి లండన్ లోని గ్రీన్ విచ్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదవడానికి అవకాశం వచ్చింది. ఉన్నత చదువుల కోసం శతాక్షి దేశాలకు వెళుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి వచ్చింది. ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడంలో ముందుండే ఎమ్మెల్యే మేడిపల్లి శతాక్షికి ఆర్థిక సహకారం అందజేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం కరీంనగర్ లోని తన నివాసంలో శతాక్షిని అభినందించి, స్వంత ఖర్చులతో కొనుగోలు చేసిన రూ. 70 విలువైన విమాన టికెట్ ను అందజేశారు. ఖండాంతరాలు దాటి చదివి, నిర్మాత అంబేద్కర్ వలె భారతదేశానికి ఖ్యాతిని తీసుకురావాలని విద్యార్థినికి ఎమ్మెల్యే సూచించారు.





## టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

**హుస్నాబాద్ నియోజకవర్గ పరిశీలకులు దామెర సత్యం**

**హుస్నాబాద్, ఎలగందల్ టైమ్స్:** టీడీపీకి రాష్ట్రంలో పూర్వవైభవం తీసుకొస్తామని హుస్నాబాద్ నియోజకవర్గ పరిశీలకులు దామెర సత్యం అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ టీడీపీ మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యంకు, నియోజకవర్గ పరిశీలకులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దామెర సత్యం మాట్లాడుతూ.. టీడీపీ 44 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ, తెలుగు ప్రజల జీవితాల్లో సామాజిక, ఆర్థిక, మానసిక మార్పులను తీసుకొచ్చింది. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చటుతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని మండలాలు మరియు పట్టణ నూతన కమిటీలు వేశారు. హుస్నాబాద్ మండలం: అధ్యక్షులు బత్తుల శంకర్, ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటస్వామి, సైదాపూర్ మండలం: అధ్యక్షులు రావుల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, కోహెడ మండలం అధ్యక్షులు బొల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీమంతుల శ్రీనివాస్, అక్కన్నపేట మండలం: అధ్యక్షులు కొమ్ముల సుభాష్, ప్రధాన కార్యదర్శి కేశినేని సంజీవ్, భీమదేవరపల్లి మండలం: అధ్యక్షులు ఎగుల పురం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీధర్, చిగురుమామిడి మండలం: అధ్యక్షులు మహమ్మద్ షారుఖ్, ప్రధాన కార్యదర్శి వరికోలు రవీందర్, ఎల్కతుర్తి మండలం: అధ్యక్షులు మహమ్మద్ నసుర్, ప్రధాన కార్యదర్శి సుపాక రాజు, హుస్నాబాద్ పట్టణం: అధ్యక్షులు.అప్పె ఆంజనేయులు శర్మ, ప్రధాన కార్యదర్శి. మహమ్మద్ హసన్ నియామకం అయ్యారు.



## రోడ్డు ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని..

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ పట్టణం కోతిరాంపూర్ లోని సుజుకి షోరూం వద్ద గల యూటర్న్ వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని మంగళవారం రోజున 9వ డివిజన్ బిజెపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ మాసం గణేష్ మున్సిపల్ కమిషనర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాలపై గతంలో అనేక ఫిర్యాదులు చేస్తే అక్కడి ప్రాంతంలో జీబ్రా లైన్స్ వేశారు . కానీ రాత్రుళ్ళు అవి కనపడక స్పీడ్ గా వస్తున్న వాహనాల వల్ల యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని వివరించారు. ఇటీవల జరిగిన అక్కడ జరిగిన ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ప్రమాదాల నివారణకు బ్లింకింగ్ లైట్స్ , స్టాపర్లు , స్పీడ్ బ్రేకర్లు , తగిన సూచికలు ఏర్పాటు చేయాలని కోతి రాంపూర్ తొమ్మిదవ డివిజన్ ప్రజల పక్షాన కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ ఖేల్ ఖతం.. దుకాణ్ బంద్

- సీఎం వ్యాఖ్యలే నిదర్శనం
- ఇగ రైతుల హామీలన్నీ గాలికొదిలేసినట్లే
- వృద్ధులకు రూ.4 వేల ఫించన్ ఇగ ఇయ్యరు
- మోసాల కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**సిరిసిల్ల, ఎలగందల్ టైమ్స్:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పైసా అప్పు కూడా పుట్టడం లేదని, ఢిల్లీకి పోతే చెప్పులెత్తుకుపోతారేమనని దొంగలాగా చూస్తూ అపాయిట్ మెంట్ కూడా ఇవ్వడం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇగ అమలు చేయలేనని సీఎం తేల్చేశారు. ఇక వృద్ధులకు రూ.4 వేల ఫించన్ ఇగ ఇయ్యరు. మహిళలకు నెలనెలా రూ.2500, తులం బంగారం ఒట్టిమాటేనని తేలింది. నిరుద్యోగులకు రూ.4 వేల భ్రుతి ఇయ్యనట్లే. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇయ్యరని తేల్చేసినట్లే. రైతులకిచ్చిన హామీలను గాలికొదిలేసినట్లే' అని వ్యాఖ్యానించారు. ఇగ తెలంగాణలో కాంగ్రెస్ ఖేల్ ఖతం... దుకాణం బంద్ అయినట్లేనని అన్నారు. సంవిధాన్ పుస్తకం పట్టుకుని తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని గతంలో హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ ఇప్పుడెం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సీఎం వ్యాఖ్యలపై మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో భయం పట్టుకుందన్నారు. ఇచ్చిన మాట తప్పి చేతులెత్తేసిన కాంగ్రెస్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలతో కలిసి రేపటి నుండి మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుని తీరుతామని చెప్పారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండల కేంద్రానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి



సంజయ్ స్థానిక ప్రెస్ క్లబ్ ను సందర్శించారు. స్థానిక విలేకరులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. సీఎం వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా తమ భవిష్యత్తు ఏమిటనే భయంతో ఉన్నారని అన్నారు. ఢిల్లీకి పోతే అపాయిట్ మెంట్ కూడా ఇస్తలేరని చెప్పడం పచ్చి అబద్దమని, ప్రధానమంత్రిని చాలా సార్లు కలిశారని అన్నారు. 'సీఎం వ్యాఖ్యలను పరిశీలిస్తే.... ఆయన పూర్తిగా చేతులెత్తేశారు. హామీలను అమలు చేయలేం. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేం. ఇచ్చిన హామీలను అమలు చేయలేమని చెప్పిండు... ఇగ ప్రజలే ఆలోచించాలి. ఎన్నికలకు ముందు ఇదే రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పిండు. అయినా వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తానని హామీ ఇచ్చిండు. ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నడు. హామీలను అమలు చేస్తామని బాండ్ పేపర్ కూడా రాసిచ్చారు. కానీ సీఎం సీటెక్కంగనే చేతులెత్తేసిండు. ఇగ మీ ఖర్మ అని చేతులెత్తిసిండు. ఓట్లేసి గెలిపించినందుకు మీ తీట మీది అని అంటున్నడు. ఇకపై రైతులకిచ్చిన హామీలను అమలు చేయడు. వృద్ధులకు రూ.4 వేల ఫించన్ ఇయ్యడు. మహిళలకు రూ.2500లు ఇయ్యరు. తులం బంగారం ఇయ్యరు. మాట తప్పిన కాంగ్రెస్ ను ఇగ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. మాట ఇచ్చి తప్పినందుకు ఆ పార్టీ సంగతి తేలుస్తాం. ఏం ఆశించి ఎన్నికలప్పుడు హామీలను అమలు చేస్తామన్నరు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఎందుకు బాండ్ పేపర్ రాసిచ్చారు? ఇప్పుడెందుకు చేతులెత్తేశారో కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ రాక్షసత్యం బయటపడింది. సంవిధాన్ పుస్తకం చేత పట్టుకుని రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఎందుకు చేతులెత్తేశారో సమాధానం చెప్పి తీరాల్సిందే. అప్పటిదాకా కాంగ్రెస్ ను వదిలిపెట్టబోం. రేపటి నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తాం. ప్రజలతో కలిసి అడ్డుకుని తీరుతాం' అని స్పష్టం చేశారు.



## పంట మార్పిడి విధానం పాటించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఆచార్య జయశంకర్ వ్యవసాయ విద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం కొత్తపల్లి మండలం బద్దిపల్లి రైతు వేదికలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ యూరియా విరివిగా వాడడం వల్ల భవిష్యత్ తరాలకు నేల పనికిరాకుండా పోయే అవకాశం ఉందని అన్నారు. వీలైనంత తక్కువగా రసాయనాలను వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వల్ల దిగుబడిలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. దుక్కి దున్నడం నుండి పంట కోత వరకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని అన్నారు. నాసిరకం, ఎరువులు పురుగుమందులు వాడకం వల్ల రైతు నష్టపోయే అవకాశం ఉందని, డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు ఉషారాణి, మధుకర్ రావు, శ్రావణి, విద్యా భాస్కర్, మదన్మోహన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## పొన్నంకు క్రీడా సంఘాల అభినందన



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు చొరవ చూపిన రాష్ట్ర రవాణా బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా వేసవిలో క్రీడా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ యేడు గడువు సమీపిస్తున్న నగరపాలక సంస్థ క్రీడా శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై ఈ తరుణంలో ఇటీవల జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి సమ్మర్ క్యాంపులు నిర్వహణ ఆవశ్యకత గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ లను సత్వరమే సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. సమ్మర్ క్యాంపులు ఈనెల 12 నుండి నిర్వహించేందుకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, ఎస్ జి ఎఫ్, జిల్లా ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు క్రీడాకారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తపరిచారు.

# సంస్థాగతంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- యువతకు ప్రాధాన్యం
- పదవుల భర్తీలో సమతుల్యత
- మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి



**మానకొండూర్, ఎలగందల్ టైమ్స్:** సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు వీలుగా పార్టీ నూతన కమిటీల ఏర్పాటుకు అధిష్టానం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా బ్లాక్, మండల పార్టీ అధ్యక్ష పదవులకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పార్టీని పటిష్టపర్చడంలో భాగంగా అవసరమైతే చేర్పులు,మార్పులు తప్పవన్నారు. పదవుల భర్తీలో అన్ని కులాలను పరిగణలోకి తీసుకొని సమతుల్యత పాటిస్తామని, నియోకమాల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ కోసం అందరు కష్టపడి పని చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు. పార్టీని బలహీనపర్చే చర్యలకు ఎవరూ పూనుకోవద్దని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో టీపీసీసీ పరిశీలకులు నామిండ్ల శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు బండారి రమేశ్ (తిమ్మాపూర్ ), నందగిరి రవీంద్రచారి(మానకొండూర్), గోపగోని బస్వయ్యగౌడ్ (శంకరపట్నం),ముస్కు ఉపేందర్ రెడ్డి (గన్నేరువరం), ముక్కిస రత్నాకర్ రెడ్డి(బెజ్జంకి),కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి(ఇల్లంతకుంట),బెజ్జంకి మండల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పోతరవేణి పోచయ్య ముదిరాజ్, మానకొండూర్, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్లు మద్ది ఓదెలు యాదవ్, పులి కృష్ణ, వైస్ చైర్మన్లు తిరుమల్ రెడ్డి, నాంపల్లి తిరుపతి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షులు దూలం దేవేంద్ర(మానకొండూర్ ), జ్యోతి (ఇల్లంతకుంట), నాయకులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిక**

తిమ్మాపూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సింగిల్ విండో చైర్మన్ తోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నుస్తులాపూర్ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, రామకృష్ణ కాలనీ తాజా మాజీ సర్పంచ్ మీసాల అంజయ్య, గొల్లపల్లి మాజీ సర్పంచ్ మల్లెత్తుల అంజయ్య యాదవ్, రామకృష్ణ కాలనీ ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డితోపాటు వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు.






# విద్యార్థులు, యువత పుస్తక పఠనం అలవర్చుకోవాలి

**తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద**

**రామడుగు, ఎలగందల్ టైమ్స్:** విద్యార్థులు, యువతరం పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, తద్వారా జ్ఞానం పెంపొందుతుందని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. రామడుగు మండలం వెదిర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ నేరెళ్ల శారద మాట్లాడుతూ జీవితాన్ని చక్కగా మలుచుకునేందుకు పుస్తకం ఉపకరిస్తుందని అన్నారు. ఆడపిల్లలు, మహిళలకు ఎటువంటి ఆపద వచ్చినా కుటుంబ సభ్యురాలిగా సాయం చేస్తానని తెలిపారు. వెదిర సహా రామడుగు మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని వివరించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పుస్తకాలు సమాజం పట్ల అవగాహనను, జ్ఞానాన్ని పెంచుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తక పఠనానికి ప్రత్యేక గదులు కేటాయిస్తున్నామని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అందరూ అలవర్చుకోవాలని, చెడు దుష్పరిణామాలను పుస్తకపఠనంతో దూరం చేయవచ్చని అన్నారు. నిత్యం పుస్తక పఠనంతో విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం వెదిర గ్రామానికి చెందిన కోరుకొండ పల్లవి, ప్రణీతలు ఇంటర్ లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించడంతో వారిని సన్మానించారు. లైబ్రరీ ఏర్పాటు చేసిన కేరళకు చెందిన విద్యార్థిని ఆకర్షణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంఈఓ వేణు కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల తిరుపతి, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి పాల్గొన్నారు.

**కేరళ విద్యార్థినికి అభినందనలు**

తొమ్మిదవ తరగతి చదువుతున్న కేరళకు చెందిన విద్యార్థిని ఆకర్షణ సతీష్ ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. అందరికీ పుస్తకాలు అందాలన్న ఆలోచనతో చిన్న వయసులోనే ఇప్పటికి వివిధ ప్రాంతాల్లో 21 లైబ్రరీలు ఏర్పాటు చేశారని, 22వ లైబ్రరీని వెదిర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




## వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు ప్రయోజనం

- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి
- కరీంనగర్‌లో బీజేవైఎం భారీ ర్యాలీ


**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** వక్ఫ్ చట్ట సవరణ జన జాగరన అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా నుండి తెలంగాణ చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై కొందరు అపోహాతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం విచారకరమన్నారు. మరికొందరు వక్ఫ్ సవరణ బిల్లుపై పనిగట్టుకుని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ప్రోగ్రాంలో వక్ఫ్ సవరణ జన జాగరణ అభియాన్ కన్వీనర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కో కన్వీనర్, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముజీబ్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, యువ మోర్చా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాముల శ్రీకాంత్, శశిధర్ రెడ్డి, నాయకులు పుప్పాల రఘు, నాగసముద్రం ప్రవీణ్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు సమీ పర్వీజ్, బిజెపి, బీజేవైఎం నాయకు లు అశోక్, సంపత్, అనిల్, సాయి, అజయ్, జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా అధికార ప్రతినిధులు రమేష్, ప్రసన్న,సాయి కృష్ణరెడ్డి, ప్రశాంత్, పొన్నాల రాం, అరుణ్, ప్రదీప్, శివారెడ్డి, బండి సాగర్, వినయ్, వంశీకృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

**సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి**

**చిగురుమామిడి, ఎలగందల్ టైమ్స్:** వడగండ్ల వానలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశా రు. మంగళవారం సుందరగిరి, గాగిరెడ్డిపల్లె గ్రామా లలో సందవేణి మల్లయ్య అనే రైతు మామిడి తోటను, ఇందుర్తి గ్రామంలో చింతపూల నరేందర్ వరి పంటను, సుందరగిరిలోని గంగు కుమార్‌కు చెందిన రేకుల షెడ్డు కూలిపోయిన దాన్ని సీపీఐ మండల నాయకులు పరిశీలించడం జరిగిందని లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం మండలంలో ఈదురుగా లు, వడగండ్ల వానల వల్ల అపారమైన నష్టం వాటి ల్లిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మీ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ముద్రకో ల రాజయ్య,తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి గోలి బాపు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గుండె సమస్యలతో బాధపడుతున్నారా
24 గంటల కార్డియాలజీ సేవలు మన కరీంనగర్ లో
ఛాతీ నొప్పి లేదా శ్వాస ఆడకపోవడం
అధిక రక్త పోటు
అధిక కొలెస్ట్రాల్
వికారం , అజీర్ణం & గుండెలో మంట
తల తిరుగున్నట్లు
గొంతు లేదా దవడ నొప్పి
HELPLINE
9985 104 108
కరీంనగర్
సివిల్ హాస్పిటల్ ప్రక్కన
FORTUNE
MEDCARE HOSPITAL
Ray of HOPE